చీనీ ధర తగ్గుముఖం

- ఉత్తరాదిలో అధిక వర్షాలతో తగ్గిన డిమాండ్
- చెట్లపై కాయలుంచితే డాగు పురుగుతో మరింత నష్టం
- ఆందోళనలో రైతులు



విక్రయానికి సిద్ధంగా చీనీ కాయలు

డాగు పురుగు రంధ్రం చేసిన దృశ్యం

తాడిపత్రి రూరల్: తగ్గిన ధరతో చీనీ రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. సీజన్‌లో ఎక్కువ ధర పలకాల్సిన చీనీ కాయలు తక్కువ ధర పలుకుతున్నాయి. ఉత్తరాదిలో అధిక వర్షాల వల్ల చీనీ కాయలకు డిమాండ్ తగ్గింది. తాడిపత్రి ప్రాంతం నుంచి ఢిల్లీ, కలకత్తా, ముంబాయి, గుజరాత్ తదితర చోట్లకు చీనీ కాయలను ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం అక్కడ భారీ వర్షాలు కురుస్తుండం, వాతావరణ చల్లబడటం తదితర కారణాలతో చీనీ కాయలకు డిమాండ్ తగ్గి ఎగుమతులు మందగించాయి. ఏటా జులై నెలలో టన్ను రూ. 40 వేల వరకు పలుకుతుండేది. కానీ నేడు టన్ను రూ. 17వేల వరకూ ఉంటోంది. గతంలో కంటే ధర సగానికి పడిపోవడంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఇప్పట్లో ధరలు పెరిగే అవకాశాలు కనిపించకపోవడంతో పాటు చెట్టు మీద ఉన్న కాయలు రంగు మారి వాటికి మరింత ధర తక్కువగా నిర్ణయిస్తారన్న భయంతో రైతులు చీనీ కాయలను విక్రయిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం తాడిపత్రి ప్రాంతంలో 25 వేల ఎకరాల్లో చీనీ సాగులో ఉంది.

రైతులను ఆందోళనకు గురిచేస్తున్న డాగు పురుగు

డిమాండ్ వచ్చే వరకూ కాయలను చెట్టు మీద ఉంచడానికి రైతులకు ధైర్యం చాలడంలేదు. చెట్టు మీద ఉన్న కాయలకు డాగు పురుగు ఆశిస్తోంది. ఈ పురుగు కాయకు రంధ్రం చేస్తూ రసం పీల్చుతోంది. ఈ రంధ్రంలోకి శిలీంద్రాలు, తెగుళ్లు ఆశించి కాయలను కుళ్లిపోయేటట్టు చేస్తున్నాయి. నాలుగైదు రోజులకు కాయ లోపల కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయి. సకాలంలో గుర్తించి మందులను పిచికారీ చేయకుంటే తెగులు కారణంగా కాయలు కుళ్లిపోయి దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి.ఈ తెగులుకు భయపడి రైతులు ఉన్న ధరకు విక్రయించాల్సి వస్తోంది.

చీనీ సాగు ఇలా..

మండలం	ఎకరాలు
తాడిపత్రి	1081
పెద్దపప్పూరు	3942
యల్లనూరు	12000
పుట్లూరు	5500
యాడికి	1303

సూట్ పేరుతో వ్యాపారుల దగా

చీనీ రైతులను సూట్ పేరుతో వ్యాపారులు దగా చేస్తున్నారు. పది టన్నుల కాయలకు రెండున్నర టన్నుల సూట్ తీసుకుంటున్నారు. గతంలో టీడీపీ హయంలో చీనీ రైతుల నుంచి సూట్ వసులు చేస్తే చర్యలు తీసుకుంటామని పాలకులు హెచ్చరించారు. సూట్ వసులు చేసే వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని అప్పట్లో పోలీసులకు ఆదేశాలు కూడా వచ్చాయి. పోలీసుల కేసులకు భయపడి కొంత కాలం వ్యాపారులు సూట్ వసులు చేయకుండా కేవలం కమీషన్ మాత్రమే తీసుకునే వారు. కమీషన్ వల్ల పెద్దగా ఆదాయం లేక పోవడంతో అప్పుడున్న పోలీసు అధికారులను లోబరుచుకుని వ్యాపారులు తిరిగి సూట్ వసులు చేయడం ప్రారంభించారు. సూట్ వసులు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

డాగు పురుగు ఆశిస్తోంది



చీనీ కాయలకు డాగు పురుగు ఆశిస్తోంది. పురుగు వల్ల కాయలు దెబ్బతింటున్నాయి. కాయలకు రంధ్రం వేసి రసం పీల్చడంతో కుళ్లిపోతున్నాయి. నాలుగు వందల చెట్లు సాగులో ఉన్నాయి. కాయలతో చెట్టు నిండి ఉన్నాయి. వీటికి డాగు పురుగు ఆశించకుండా మందు పిచికారీ చేస్తున్నాను. అయినా ప్రయోజనం లేక విక్రయించాల్సి వస్తోంది.

– కుపేంద్రరెడ్డి, రైతు, రంగరాజుకుంట

ధర లేకపోవడంతో నష్టం



చీనీ పంటకు సీజన్‌లో ధరలు లేకపోవడంతో నష్టపోతున్నాం. టన్ను రూ.17 వేల వరకూ పలుకుతోంది. చెట్ల మీద కాయలు ఉన్నాయి. ఎందుకు ధర తగ్గిందని వ్యాపారులను అడిగితే ఉత్తరాదిలో వర్షాలు కురుస్తున్నాయని , వాతావరణం మారడంతో డిమాండ్ లేదని చెబుతున్నారు. ధరలు పెరుగుతాయన్న ఆశ కనిపించడం లేదు. మూడు వందల చెట్లకు కాయలు కాశాయి. వాటిని తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.

– గంగరాజు, రైతు, దేవుని ఉప్పలపాడు

జాగ్రత్తలు తీసుకోవాలి



చీనీ కాయలకు ఆశిస్తున్న డాగు పురుగుల నివారణకు సకాలంలో జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తోటల చుట్టూ సోలార్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తే వాటి వెలుగుకు పురుగుల కాయలను ఆశించవు. సాయంత్రం వేళ పొలంలో పొగ పెట్టాలి. పెండాల్ మందును పిచికారీ చేయాలి. చీనీలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చు.

– ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారి

క్లుప్తంగా

అనాథాశ్రమానికి రూ.లక్ష వితరణ



చెన్నకేశవ అనాథాశ్రమం నిర్వాహకులకు నగదు అందజేస్తున్న ఆలూరు దంపతులు

శింగనమల: శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి వారి కుమారుడు ఆలూరు విరాట్ పుట్టినరోజును పురస్కరించుకుని నార్పల మండలం కురగానిపల్లి వద్ద ఉన్న చెన్నకేశవ అనాథాశ్రమం నిర్వాహకులకు రూ.లక్ష వితరణ చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వాహకులకు రూ.లక్ష నగదు అందించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ఏటా చెన్నకేశవ అనాథాశ్రమానికి రూ.లక్ష అందజేస్తున్నామన్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులను కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు : మండలంలోని చీమలవాగుపల్లి జెడ్పీ హైస్కూల్‌లోవిద్యార్థులకు శుక్రవారం వైద్యుడు మధుసూదన్ రాజు వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ అంధత్వ నివారణోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. పరీక్షల్లో ఐదుగురికి కంటి అద్దాలు అవసరమని గుర్తించామని, వారికి త్వరలో అద్దాలు అందజేస్తామన్నారు. అనంతరం పది మంది విద్యార్థులకు మందులు అందజేశారు.

అనుమతి లేకుండా ఇళ్లు నిర్మిస్తే చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: 'మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు నిర్మించాలన్నా, భవనం నిర్మించాలన్నా, లే అవుట్లు వేయాలన్నా మున్సిపల్ అధికారుల అనుమతి తప్పనిసరి. అనుమతులు లేకుండా నిర్మిస్తే చర్యలు తప్పవు' అని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బిల్డింగ్ అండ్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించినా, లే అవుట్లు వేయకుండా ప్లాట్లు వేసినా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి



కొర్ర పంటలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

పెద్దవడుగూరు: కొర్రపంటను సాగు చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంట సాగు చేసిన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పత్తి, కొర్ర పంట పొలాలను పరిశీలించారు. కొర్రపంట సాగు చేసిన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయన ఎరువులు వాడొద్దన్నారు. గులాబీ రంగు పురుగును నివారించడానికి లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేప నూనె పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, రైతులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపు, హోటల్లో చోరీ



చోరీ జరిగిన రవూఫ్ హోటల్

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శ్రీరంగా ఫర్టిలైజర్ షాపు, రవూఫ్ హోటల్లో గురువారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. దొంగలు ఫర్టిలైజర్ షాపు, హోటల్లో చొరబడి సుమారు రూ.3,000 నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు శ్రీరాములు, రవూఫ్ చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రిజర్వ్‌డ్ స్థలాల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కసాపురం రోడ్డు, మైనార్టీ కాలనీ, ఈడిగ కాలనీ, ఆర్మీకాలనీ, నేసే కాలనీ, ఆదర్శనగర్‌ల్లో ఉన్న మున్సిపల్ రిజర్వ్‌డ్ స్థలాలను అధికారులు పరిశీలించారు. శుక్రవారం కమిషనర్ వెంకటరమణయ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సత్తార్, ఎంఈ గురప్పయాదవ్ ఆయా స్థలాలను పరిశీలించి, కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. అంతకుముందు కమిషనర్ 38వ వార్డులో పారిశుధ్య పనులు పరిశీలించి చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలను శుభ్రం చేయించారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

పామిడి: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీపై చర్చించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సమస్యలను ఎలా అధిగమించాలన్న తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీకాంత్ రెడ్డి, వెంకటరాముడు, రమేష్, మల్లీశ్వరి, భాగ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ బయట ఇద్దరు వ్యక్తులు వడ్డీ డబ్బుల కోసం గొడవకు దిగారు. పోలీసుల వివరాల మేరకు.. వీరాంజనేయులు, మునీంద్ర గొడవకు దిగగా కుటుంబీకులు సైతం గొడవ పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు వీరాంజనేయులు, మునీంద్రలతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సంపత్ కుమార్ తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు

గుత్తి: విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్‌ఎఫ్ చేపట్టిన జీపు జాతా గుత్తిలో రెండో రోజు శుక్రవారం కూడా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఆవరణలో విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారమే ఎజెండాగా జీపు జాతా చేపట్టామన్నారు. పెండింగ్‌లో ఉన్న హాస్టళ్ల విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు వెంటనే ఇవ్వాలని, వసతి గృహాలు, కళాశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, వంశీ, నియోజకవర్గ నాయకులు లక్ష్మీప్రసాద్, విజయ్, మండల నాయకులు కిరణ్, అఖిల్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం






అన్నాభిషేకం అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు , శాకంబరి అలంకరణలో పార్వతీదేవి

తాడిపత్రి అర్బన్: స్థానిక బుగ్గ రామలింగేశ్వరుడి ఆలయంలో మూలవిరాట్‌కు ఆషాఢ మాసంలో ఆరుద్ర నక్షత్రం, మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయమే స్వామికి రుద్రాభిషేకం అనంతరం పంచామృతాభిషేకాన్ని చేశారు. ఉదయం 10 గంటలకు మూలవిరాట్‌కు అన్నాభిషేకం నిర్వహించారు. కార్యక్రమం మధ్యాహ్నం 12గంటల వరకూ కొనసాగింది. 12 గంటల తరువాత భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని పార్వతీదేవి శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు శాకాంబరి మాతకు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. 7 గంటలకు బుగ్గరామలింగేశ్వరస్వామి, శాకంబరి అలంకారంలో కొలువదీరిన పార్వతీదేవికి ప్రదోశ పూజ దశ విద హారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాకంబరి అలంకరణలో వాసవీమాత



గుత్తిలో శాకంబరి అలంకరణలో అమ్మవారు

గుత్తి: పట్టణంలోని వాసవీ బజారులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ మహిళా మండలి, యువజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మూలవిరాట్‌కు శాకంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు చేశారు. కాగడ హారతి, పంచామృతాభిషేకం, అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న పార్వతి దేవికి సారె ప్రదానం చేశారు. ప్రధాన అర్చకుడు వాసుదేవశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



గుంతకల్లులో తల్లిపాల ప్రయోజనాలను వివరిస్తున్న అధికారులు



గుత్తిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



పామిడి మండలం రామగిరి ఎగువతండాలో మాట్లాడుతున్న అధికారులు

గుంతకల్లు రూరల్: బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని, ముర్రుపాలతో బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి గర్భిణులు, బాలింతలకు సూచించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మొలకలపెంట, కొంగనపల్లి, దోసలుడుకి గ్రామాల్లో పర్యటించిన సూపర్‌వైజర్ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాలు పట్టించడం వల్ల బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం ఆరు నెలల నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.

గుత్తి: తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని, ప్రతి తల్లీ తప్పకుండా పిల్లలకు పాలు తాపించాలని సీడీపీఓ ఢిల్లీశ్వరి బాలింతలకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీ, పద్మనాభయ్య ఫ్యాక్టరీ, స్వీపర్స్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లి పాలలో పోట్రీన్‌లు, విటమిన్లతో పాటు రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయన్నారు కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, పార్వతి, గంగా తదితరులు పాల్గొన్నారు.

పామిడి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఎంఎల్ఎంపీ రాజేశ్వరి, ఏఎన్ఎం నర్మద సూచించారు. శుక్రవారం గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మండలంలోని రామగిరి ఎగువతండాలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో వారు మాట్లాడారు. తల్లి ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. అనంతరం తల్లిపాలవారోత్సవాలపై వారు గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎం.నాగమణి, ఆశా, ధనలక్ష్మి, దీప్తి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని జిల్లా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. శుక్రవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని బొమ్మలాటపల్లిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అంతకుముందు ఆమె ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌కుమార్, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఆరోగ్య విద్యా బోధకురాలు ఫర్వీన్, శ్రీదేవి, రమ్యశ్రీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థన



కేబీఎస్ మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

గుత్తి: పట్టణంలోని కేబీఎస్ మసీదులో శుక్రవారం వర్షం కోసం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా నమాజ్ చేశారు. అనంతరం హాఫీజ్ సాబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ముస్లింలు వర్షం కోసం ప్రార్థించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లింలు, కేబీఎస్ మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ శివారులో శుక్రవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడి బ్రహ్మయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కళ్యాణదుర్గానికి చెందిన బ్రహ్మయ్య ఆటో బాడుగ నిమిత్తం పత్తికొండకు వెళ్లాడు. అనంతరం ఆటో నడుపుకుంటూ గుత్తిలో ఉన్న బంధువుల వద్దకు వస్తుండగా జొన్నగిరి గ్రామ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా కుక్క అడ్డు వచ్చింది. వెంటనే ఆయన బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఇరుక్కున్న బ్రహ్మయ్యను స్థానికులు బయటకు తీసి వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న వైద్యులు, సిబ్బంది

గుత్తి: మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సుమారు 100 మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ చెట్లు అధికంగా ఉంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. వైద్యులు ఎల్లా రాముడు, సందీప్, ఉదయ భాను, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీం' తీర్పు హర్షణీయం



గుత్తిలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పెద్దవడుగూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి/పెద్దవడుగూరు: ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో మరింత వెనుకబడిన కులాల వారికి కోటాను కల్పించడానికి ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ చేసిన పోరాటం ఫలించిందన్నారు. సుప్రీం ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సుప్రీమ్ కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో గుత్తిలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ సర్కిల్, లచ్చానపల్లి రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజన్ ప్రసాద్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ పోరాటాలకు సుప్రీమ్ కోర్టు తీర్పుతో న్యాయం జరిగిందన్నారు. ఈ తీర్పుతో ఎస్సీలో ఉన్న 59 ఉప కులాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షులు రామదాసు, నాయకులు పులికొండ, కాశీరావు, లాలెప్ప, నాగార్జున, రమేష్, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, హరి , ఓబులేసు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదినారాయణ, పెద్దిరాజు తదితరులు సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు.